
గోదావరి పరవళ్లు

సముద్రంలోకి 5,06,438 క్యూసెక్కులు

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో


తూర్పుగోదావరి ప్రథమం 7











ఆహా..అద్భుతః!

రాజమహేంద్రవరం గోదావరిపై వంతెనలు ఒక అద్భుతమే.. ఏ వంతెన లెక్క తీసినా తక్కువ కాదంటే 50 ఏళ్లు పైనే.. ఏ వంతెనకు ఆ వంతెన పోటీపడుతుంటాయి.. ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు.. వీటిని ఎలా కట్టారు చెప్మా అని అనిపించకమానదు.. ఎందుకంటే ఏనాడో బ్రిటిష్ వారి కాలంలోనే గోదారి చూపారు.. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాలు సస్యశ్యామలంగా ఉన్నాయంటే.. ఆ ఘనత అంతా ధవళేశ్వరం బ్యారేజీదే.. ఏళ్లు గడచిపోతున్నా నేటికీ చెక్కుచెదరలేదు.. గోదారి మార్చలేదు.. మరో వైపున రోడ్ కం రైలు బ్రిడ్జి గాలిలోనే అంతా ఉంటుంది.. ఆసియాలోనే రెండో రోడ్ కం రైలు బ్రిడ్జిగా పేరు.. ఇక మూడోది ఆర్చి బ్రిడ్జి.. ఈ వంతెన టెక్నాలజీ అంతా సెపరేటు.. ఆ వంతెనపై ఉన్న వైర్లు ఆధారం అంటే ఆహా అనిపించకమానదు మరి.. ఇక అతి పాతది..నాలుగోది హేవలాక్ బ్రిడ్జి..దీని వయసు 125 ఏళ్లు.. ఈ నాటికి చెక్కుచెదరలేదంతే.. నేడో రేపో పర్యాటకంగా అభివృద్ధికి అడుగుల పడనున్నాయి.. యంత్రాలు అందుబాటులో లేని రోజుల్లోనే ఈ అద్భుతాలు ఆవిష్కరింపజేశారు మన ఇంజనీర్లు.. నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు.. నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి.. ఇంజనీరింగ్ డేను పురస్కరించుకుని ఒక చిత్రమాలిక. -ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఎంచక్కా.. వ్యాపారం!





బెల్ట్ జోరు..ఆపేవారెవరు..

కొవ్వూరు మండలంలో 16 గ్రామాలు ఉండగా 7 మద్యం షాపులు మాత్రమే ఉన్నాయి.. అంటే 9 గ్రామాల్లో మద్యం షాపులే లేవు. తాళ్లపూడి మండలంలో 18 గ్రామాలు ఉండగా 5 మద్యం షాపులు ఉన్నాయి. అంటే 13 గ్రామాల్లో లేవు.. ఇక కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అయితే మండల కేంద్రాలకు గ్రామాలకు మధ్య దూరం చాలానే ఉంటుంది.. దీంతో మద్యం షాపులు లేని గ్రామాలను వ్యాపారులు పంచుకుని అనధికారికంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఎక్సయిజ్ అధికారులు అటు వైపు చూసే సాహసం చేయడంలేదు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ మద్యం వ్యాపారం మూడు సీసాలు.. ఆరు గ్లాసులుగా సాగుతూనే ఉంది..

అన్నవరంలో దేవస్థానం వద్ద బ్రాంది షాపు ఉండదు.. కానీ అక్కడ మద్యం యథేచ్ఛగా లభ్యమవుతోంది.. ఎలాగంటే బెల్ట్ మహత్యం.. దేవస్థానం దిగువున ఉన్న దుకాణాల్లో జోరుగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి.. ఆ సెంటర్‌కు వెళ్లి ఎవరిని అడిగినా బెల్ట్ షాపు ఎక్కడనేది చూపిస్తారు. కానీ మన ఎక్సయిజ్ అధికారులకు కనిపించదు.. ఎందుకో..! తలుపులమ్మ లోవకు వెళ్లేందుకు జాతీయ రహదారి దిగి.. పక్కనే కిరాణా కొట్టులోకి వెళితే చాలు మద్యం లభ్యమవుతోంది.. నిత్యం అమ్మకాలు సాగుతూనే ఉంటాయి.. ఆ దుకాణం వాహన డ్రైవర్లు అందరికీ సుపరిచితమే..అయినా అధికారులకు పట్టదు. ఎందుకంటే పేరుకు అనధికారికమైనా.. ప్రైవేటు వ్యాపారుల కనుసన్నల్లోనే అధికారికంగా బెల్ట్ దుకాణాలు సాగుతున్నాయి.. - (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎక్సయిజ్ అధికారులు బెల్ట్ తీయలేకపోతున్నారు..గత టీడీపీ ప్రభుత్వంలో బెల్ట్‌షాపులను పూర్తిగా నిర్మూలించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం బెల్ట్‌షాపులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పోయాయి..ప్రతి పల్లెలోనూ షాపులు వెలిశాయంటే అతిశయోక్తి కాదేమో.. అయినా ఎక్సయిజ్ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.. ఎందుకంటే ప్రస్తుతం పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో మాత్రమే మద్యం దుకాణాలు ఉన్నాయి. గ్రామాల్లో మద్యం దుకాణాలు దాదాపుగా కనుమరుగయ్యాయి. దీంతో పల్లెజనం బెల్టు షాపులపై ఆధారపడక తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం తెచ్చిన కొత్త మద్యం పాలసీ కారణంగా గ్రామాల్లో మద్యం షాపులు ఉండే అవకాశం లేదు. ఇదే అదనుగా ప్రైవేటు మద్యం వ్యాపారులు తలో కొన్ని గ్రామాలు పంచేసుకొని బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. అటు బెల్టుల నుంచి.. ఇటు ప్రైవేటు మద్యం షాపుల నుంచీ ఎంతో కొంత అందుతుండడంతో ఒక దెబ్బకు రెండు తాయిలాల మాదిరిగా ఎక్సైజ్ కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది.

గ్రామాల్లో మందు కరువు

ప్రభుత్వ మద్యం పాలసీలో ప్రైవేటు మద్యం షాపులకు లైసెన్స్‌లు ఇచ్చే సమయంలో మండల కేంద్రాలను యూనిట్‌గా తీసుకున్నారు. అంటే మండలంలో ఎక్కడైనా మద్యం షాపు ఏర్పాటు చేసుకోవచ్చు. సాధారణంగా మండల కేంద్రంలో జన సమ్మర్థం ఎక్కువ. దీంతో షాపులు దక్కించుకున్న వాళ్లంతా మండల కేంద్రాల్లో దుకాణాలు తెరిచారు. పెద్ద గ్రామాల్లోనూ మద్యం షాపులు లేకుండా పోయాయి. అక్కడక్కడా అరకొరగా మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 1030 గ్రామాలు ఉంటే 80 శాతం గ్రామాల్లో మద్యం షాపులే లేవు.దీంతో ప్రైవేటు వ్యాపారులు గ్రామాల్లో బెల్టు షాపులు తెరిచారు. పెట్టుబడి లేని వ్యాపారం కావడంతో పల్లెల్లో చిరువ్యాపారులు పోటీపడుతున్నారు.

455 దుకాణాలు.. 1030 గ్రామాలు

తూర్పు గోదావరిలో 138, కాకినాడ జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 146 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో 19 మండలాలు, నగరపాలక సంస్థ 1, నగర పాలక సంఘాలు 2, రెవెన్యూ గ్రామాలు 303 ఉండగా రూరల్ జనాభా 12లక్షలు, అర్బన్ జనాభా 8 లక్షలు ఉన్నారు. కాకినాడ జిల్లాలో 21 మండలాలు, కార్పొరేషన్ 1, నగర పంచాయతీలు 2, రూరల్, రెవెన్యూ గ్రామాలు 412 ఉండగా రూరల్‌లో 5 లక్షలు, అర్బన్‌లో 10లక్షల జనాభా.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాలు,నగరపాలక సంఘం 1, రూరల్, రెవెన్యూ గ్రామాలు 316 ఉన్నాయి. రూరల్‌లో జనాభా 17 లక్షలు, అర్బన్ 3 లక్షలు ఉన్నారు. ఈ లెక్కన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1030 కిపైగా రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మొత్తం 455 ప్రైవేటు మద్యం షాపుల్లో 400 వరకూ పట్టణాలు/నగరాల్లోనే ఉన్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని 35 లక్షల వరకూ జనాభాలో 10 లక్షల మందికి మద్యం తాగే అలవాటున్నా వాళ్లు 50 షాపుల్లోనే సర్దుకోవాల్సి వస్తోంది.

- కలిసొచ్చిన మద్యం పాలసీ
- మండలం యూనిట్‌గా కేటాయింపు
- గ్రామాల్లో మద్యం షాపులు నిల్
- బెల్టు షాపులు తప్పని పరిస్థితి
- గ్రామాలు పంచుకొన్న వ్యాపారులు
- పట్టించుకోని ఎక్సయిజ్ అధికారులు

అడకత్తెరలో ఎక్సయిజ్ శాఖ..

బెల్టు షాపులు చట్టరీత్యా అంగీకారం కాదు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది కేసులు నమోదు చేయవచ్చు. కానీ కొన్ని పరిస్థితుల వల్ల వాళ్లేమీ చేయలేకపోతున్నారు. అరకొరగా కేసులు నమోదు చేస్తున్నారు. బెల్టు షాపుల నుంచి వారికి నెలవారీ మామూళ్లు వెళతాయనేది బహిరంగ రహస్యమే. మరో వైపు ఆయా బెల్టు షాపులు నడుపుతున్న లైసెన్స్‌డ్ ప్రైవేటు మద్యం దుకాణాల నుంచీ ఎంతో కొంత ముడుతోంది. పైగా బెల్టు షాపుల వల్ల అమ్మకాలు పెరుగుతాయి. దీంతో లక్ష్యాలనూ సులభంగా చేరుకోవచ్చు. ఖజానాకు ఆదాయం సమకూరుతోంది. ఈ నేపథ్యంలో చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు.

రెడీఎస్సీ!

నేడే ఉపాధ్యాయ అభ్యర్థుల తుది జాబితా విడుదల

- మొత్తం 1241 పోస్టులు
- 16,17న వెబ్ ఆప్షన్లు స్వీకరణ
- 19న నియామకపత్రాలు
- 20, 21న జాయినింగ్

(కాకినాడ/రూరల్-ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయ ఉద్యోగాలకు సంబంధించిన అభ్యర్థుల ఎంపిక తుది జాబితా సిద్ధమైంది. ఇప్పటికే ఎంపికైన డీఎస్సీ అభ్యర్థుల వివరాలు వెల్లడించి వారి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. తుది జాబితాలను సోమవారం సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం, మెగా డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ https: //apdsc.apcfss.inలో అందుబాటులో ఉంచనున్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్ ముగింపు దశకు చేరుకుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 1241 పోస్టులు ఉన్నాయి. గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ ఇంజనీరింగ్ కళాశాలలో గత నెల 28 నుంచి ఈ నెల 13వ తేదీ వరకు ఏడు విడతల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఖాళీలకు పోస్టింగ్స్ కేటాయింపుపై 16,17 తేదీల్లో వెబ్ ఆప్షన్ స్వీకరించి 19న ఉత్తర్వులు జారీ చేస్తారు. నియామకపత్రాలు పొందిన కొత్త టీచర్లు వారికి కేటాయించిన పాఠశాలల్లో 20, 21 తేదీల్లో రిపోర్టు చేయాల్సి ఉంది. 22 లేదా 23 నుంచి దసరా సెలవుల్లో శిక్షణ ఉంటుంది. శిక్షణ బృందాలను సిద్ధం చేశారు.

పోస్టులు ఇవీ..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా డీఎస్సీలో 1241 పోస్టులు ఉండగా 63,004 దరఖాస్తులు వచ్చాయి.38,617 మంది పరీక్షలు రాశారు. స్కూల్ అసిస్టెంట్ 608, పీఈటీలు 210, ఎస్జీటీ 423 పోస్టులు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తెలుగు 65, హిందీ 78, ఇంగ్లీష్ 95, గణితం 64, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సోషల్ 132, వ్యాయామ విద్య 210 ఉద్యోగాలతో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల ఉద్యోగాలు ఉన్నాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమానికి సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1, ఎస్జీటీలు 104 మొత్తం 112 ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 13 టీజీటీలు, మూడు పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి 31 పోస్టులు ఉన్నాయి. జోన్ 2 (ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా)కు సంబంధించిఏపీఆర్ఎస్,ఏపీఎంఎస్, ఏపీఎస్‌డబ్ల్యూ, బీసీ, సోషల్ వెల్ఫేర్‌కు సంబంధించి పీజీటీ 49, టీజీటీ 272, పీడీ 3, పీఈటీ 24తో కలిపి మొత్తం 348 పోస్టులు భర్తీ చేయనున్నారు.





నిడదవోలు మండలం కంసాలిపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ

ఉప్పొంగిన ఎర్రకాలువ

- రోడ్లపైకి చేరిన నీరు
- గ్రామాలకు రాకపోకలు బంద్
- మంత్రి, కలెక్టర్ సమీక్ష
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- అప్రమత్తం కావాలని సూచన

నిడదవోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. నిడదవోలు మండలం కంసాలిపాలెం తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య ఆదివారం ఎర్రకాలువ ఉధృతంగా ఉంది. అలాగే శింగవరం, తాళ్ళపాలెం గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ నాగరాజు నాయక్, ఎంపీడీవో జగన్నాథరావు ఎర్రకాలువ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించారు. కంసాలిపాలెం,శింగవరం, తాళ్ళపాలెం,శెట్టిపేట, తిమ్మరాజుపాలెం గ్రామాలకు ఎర్రకాలువ వరద ముప్పు పొంచి ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పునరావాస కేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

అప్రమత్తంగా ఉండండి : దుర్గేష్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువకు ఒక్కసారిగా 6, 500 క్యూసెక్కుల వరద రావడంతో ఉధృతంగా ఉందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 8,500 క్యూసెక్కులు దాటే ప్రమాదం ఉందన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు.ఈ కాలువ ముంపు వల్ల గోపాలపురం,నిడదవోలు నియోజకవర్గాలు ప్రభావితమవుతాయన్నారు. ఎర్రకాలువకు ఉధృతంగా వరద నీరు చేరడంతో ప్రజలను అప్రమత్తం చేసినట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిడదవోలు మండలం తాళ్లపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండడంతో ట్రాఫిక్ మళ్లించామన్నారు. కలెక్టరేట్, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, 24 గంటలూ హెల్ప్‌లైన్ నెంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. మెడికల్ క్యాంపులు సిద్ధం చేసినట్టు చెప్పారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

కొవ్వూరు ఆర్డీవో ఆఫీస్	7995367797
నిడదవోలు	9676253740
గోపాలపురం	7013027755
నల్లజర్ల	9491041451
ఉండ్రాజవరం	9491041474
బొమ్మూరు కలెక్టరేట్	8977935611

అగ్రి,ఆక్వాకల్చర్ హబ్‌గా జిల్లా

మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న కొత్త తూర్పుగోదావరి జిల్లాను అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దనున్నామని, జిల్లా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. జనసేన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. శాస్కి స్కీమ్ ద్వారా అఖండగోదావరి ప్రాజెక్టుకు కేంద్రం నుంచి మంజూరైన రూ.94.44 కోట్లలో ఇప్పటికే కొన్ని పనులు మొదలు పెట్టామన్నారు. రాజమహేంద్రవరం, కడియం, నిడదవోలు ప్రాంతాలన్నీ సరికొత్త పర్యాటక శోభను సంతరించుకుంటాయన్నారు. నిడదవోలు అభివృద్ధికి 15 నెలల్లో రూ.300 కోట్లు వెచ్చించినట్టు చెప్పారు.ఇప్పటి వరకూ ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన పి.ప్రశాంతి పనితీరు భేష్ అని అభినందించారు. కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కీర్తి చేకూరిని స్వాగతిస్తున్నామన్నారు.

సోము వర్సెస్ ఉండవల్లి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపరాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా ఆర్ఎస్ఎస్ మీద మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ సోము వీర్రాజు బహిరంగ చర్చకు సవాల్ విసిరిన సంగతి విదితమే.దీనిపై ఉండవల్లి స్పందించారు.ఎప్పుడు బహిరంగ చర్చ పెడతారో పెట్టండి..నేను సిద్ధం అని అరుణ్‌కుమార్ ప్రతి సవాల్ విసిరారు.ఈ సవాళ్లు ఆసక్తికరంగా మారాయి.వీరిద్దరు ఎప్పుడు బహిరంగ చర్చకు సిద్ధమవుతారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఊరికే.. తిరిగేస్తున్నారు!



- మహిళలు ఫుల్ హ్యాపీ
- నెల రోజులు..రూ.14 కోట్లు
- గతంలో 71 శాతం ఆక్యుపెన్సీ
- 84 శాతానికి పెరిగిన వైనం
- రద్దీగా పలు రూట్లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఊరికే వస్తుంటే ఊరుకుంటారా.. అందుకే మహిళలు ఊరూరా తిరిగేస్తున్నారు. ప్రస్తుతం ఏ బస్ చూసినా మహిళలతో కిటకిటలాడుతోంది. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం వినియోగించుకోవడం ద్వారా జిల్లా మహిళలు ఒక్కనెలలోనే దాదాపు రూ.14 కోట్లకు పైగా ఆర్థిక లబ్ధి పొందారంటే ఏ స్థాయిలో ప్రయాణిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గత నెల 15వ తేదీన ఈ పథకం అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకూ 32 లక్షల మందికి పైగా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు రాకపోకలు సాగించారు. జిల్లా ఆర్టీసీ మొత్తం 96 రూట్లలో బస్సులు తిప్పుతుంటే వీటిలో 72 రూట్లను ప్రత్యేకంగా స్త్రీ శక్తి పథకానికే కేటాయించారు. ఇది మొత్తం రూట్లలో 75 శాతం. గత నెల 14వ తేదీకి ముందు వరకూ ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 71 శాతంగా ఉండేది. ఇప్పుడది 84 శాతానికి పెరిగింది. వీరిలో ప్రత్యేకంగా ఆడవాళ్ల శాతం 68.72 శాతం ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చిన తర్వాత కొన్ని రూట్లలో విపరీతమైన రద్దీ పెరిగింది. రాజమహేంద్రరం - తుని, రాజమహేంద్రవరం-కాకినాడ వయా రాజానగరం, వయా బిక్కవోలు, కొవ్వూరు - ఏలూరు, కొవ్వూరు - జంగారెడ్డిగూడెం రూట్లలో రష్ ఎక్కువగా ఉంది.బస్సులకు డిమాండ్ పెరిగినా కొత్త రూట్లు ఆపరేట్ చేసే పరిస్థితి లేదు. జిల్లావ్యాప్తంగా గతంలో కొన్ని రూట్లలో బస్సు సర్వీసులు క్యాన్సిల్ చేశారు. వీటిని పునరుద్ధరించాలని డిమాండ్ ప్రధానంగా వస్తున్నా కొత్త సర్వీసులు నడిపేందుకు ప్రస్తుతం అవకాశం లేదని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉన్న బస్సులతోటే నడపమనే ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ఆర్టీసీ అధికారులు షెడ్యూళ్లు నిర్వహిస్తున్నారు.

ప్రయాణ ఖర్చు రూ.13.82 కోట్లు

ఉచిత బస్సు పథకం ప్రారంభమైన నెల రోజుల్లో ఆక్యుపెన్సీ రేషియో బాగా పెరిగింది. మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు.ఈనెల 12వ తేదీ వరకూ లెక్కలు పరిశీలిస్తే 31.73 లక్షల మంది మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ట్రావెల్ చేశారు. రూ.13.82 కోట్లు లబ్ధిపొందారు.

- మూర్తి, జిల్లా ప్రజారవాణా అధికారి

ఆరోగ్యానికి..సైకిల్!

ఈ ఫొటోల్లో కనిపిస్తున్న వాళ్లు క్రీడాకారులు కాదండి. మన పోలీసులే. 'ఫిట్ ఇండియా' కార్యక్రమంలో భాగం గా ప్రతి ఆదివారం పోలీస్ శాఖ 'సండే ఆన్ సైకిల్' నిర్వహిస్తోంది. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో జిల్లా పోలీసులు ఈ ఆదివారం ఇలా సైక్లింగ్ చేశారు. అధికారులు, సిబ్బందిలో శారీరక దృఢత్వం, ఆరోగ్యకర మైన జీవనానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో మేలు చేస్తాయని అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. - రాజమహేంద్రవరం



గోదావరి పరవళ్లు



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి విడుదలవుతున్న వరద నీరు

5,06,438 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల

ధవళేశ్వరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలి ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 1.5 మీటర్లు.. మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను మీటరు మేర పైకి ఎత్తి 5,06,438 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదైంది. ఎగువన భద్రాచలం వద్ద 36.10 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది.



వరద నీటిలో ఉన్న గండిపోశమ్మ అమ్మవారి ఆలయం

వరద నీటిలో గండిపోశమ్మ ఆలయం

దేవీపట్నం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలంలో గోదావరి మళ్లీ పెరుగుతుంది. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారి ఆలయం వరద నీటిలోనే ఉంది. అలాగే పాపికొండల విహారయాత్ర పర్యాటక బోట్లను నిలిపివేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు

ద్రాక్షారామలో రాట ముహూర్తం



ద్రాక్షారామ, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఈనెల 22 నుంచి జరగనున్న దేవీశరన్నవరాత్రి ఉత్సవ ఏర్పాట్లకు ఆదివారం శాస్త్రోక్తంగా రాట ముహూర్తం జరిపారు. ఉదయం ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గాభవానీ, సత్యంవాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, కృష్ణ కుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. 10.58 గంటలకు రాట ముహూర్తం చేశారు. ఆలయ అర్చకులు, వేదపండిత బృందం కార్యక్రమం జరిపించారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, నాటక అకాడమీ డైరెక్టరు పెంకే అన్న పూర్ణ, కూటమి నాయకులు పెంకే సాంబశివరావు, సంపత్, ఏడుకొండలు, భక్తులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో రాట ముహూర్తం చేస్తున్న ఈవో తదితరులు

'లోవ'లో భక్తుల కోలాహలం



క్యూలో బారులుతీరిన భక్తులు

రూ.6.14 లక్షల ఆదాయం



తలుపులమ్మ అమ్మవారు

తుని రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్యూలలో బారులు తీరి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.6.14 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో పి.విశ్వనాధ రాజు తెలిపారు.

పంటకాలువలో వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ఆత్రేయపురం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటకాలువలో వృద్ధురాలు ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురానికి చెందిన అవిడి సత్యవతి(60) ఆదివారం ఉదయం లొల్ల పాత బ్రిడ్జి పంటకాలువలో శవమై తేలింది. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సత్యవతి శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాలేదని ఆమె తమ్ముడు సూర్యారావు తెలిపాడు. మృతదేహాన్ని పరిశీలించి తన అక్కగా నిర్ధారించాడు. సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి



నాగబాబు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

అల్లవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం డి.రావులపాలెం గ్రామానికి చెందిన కాంట్రాక్టరు వంటెద్దు నాగబాబు (40) ఆదివారం ఆక్వా చెరువుల వద్ద విద్యుదాఘాతానికి గురై మరణించాడు. నాగబాబు గుండెపూడిలో తాను కౌలు సాగు చేస్తున్న ఆక్వా చెరువుల వద్ద పాడైన ఏరియేటర్‌ను బాగు చేసేందుకు చెరువులో దిగి విద్యుఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడని పోలీసులు తెలిపారు. రొయ్యల చెరువుల వద్ద నాగబాబు మృతదేహాన్ని వెలికితీసి అల్లవరం ఎస్ఐ బి.సంపత్‌కుమార్ దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికై అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. నాగబాబు మృతి పట్ల పంచాయతీ రాజ్ డీఈఈ అన్యం రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు వేగిరాజు వెంకట్రాజు, తిక్కా వెంకటప్రసాద్, ఆకుల లక్ష్మణరావు, పోతుల చంద్రబోస్ సంతాపం వ్యక్తం చేశారు.

ఉమ్మడి జిల్లా

కరాటే పోటీల విజేత

పేరూరులో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కరాటే పోటీలు





పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్

అమలాపురం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం పేరూరు పీఆర్కే పంక్షన్ హాలులో ఆదివారం పవర్‌కిక్ షోటోకాన్ కరాటే డూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల కరాటే పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. పోటీలను ఆదివారం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ప్రారంభించారు. 6 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వయసు గల సుమారు 952 మంది క్రీడాకారులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచినట్టు చీఫ్‌ఆర్గనైజర్ పడాల అంజి తెలిపారు. కటాస్, కుమిటీ విభాగాల్లో ఈ పోటీలను ఆర్గనైజింగ్ కార్యదర్శి చిక్కం సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రథమస్థానం, తెలంగాణకు ద్వితీయ స్థానం దక్కింది. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వివిధ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. గంటి హరీష్‌బాలయోగితో పాటు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు పతకాలు, ప్రశంసాపత్రాలను అందించారు. పోటీల్లో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.

మండపేటలో ముగిసిన రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

మండపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో 2రోజులపాటు జరిగిన 49వ రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. రాష్ట్రంలోని 17 జిల్లాల నుంచి వచ్చిన 17 జట్లకు చెందిన క్రీడాకారులు పాల్గొనగా జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే బాలురు, బాలికల జట్లను ఎంపిక చేశారు. అక్టోబరు 8 నుంచి 12 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని నోయిడాలో జరిగే జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన జట్ల వివరాలను టెన్నికాయిట్ రాష్ట్ర అసోసియేషన్ కోశాధికారి రిఫరీ కుంచే రమేష్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు జట్ల ఎంపిక

జట్లకు ఎంపికైన వారు..

బాలుర జట్టుకు రామారావు(కాకినాడ), వినయ్ (కాకినాడ), బి.సిద్ధార్థ (శ్రీకాకుళం), రాహుల్(విజయనగరం), చంటిబాబు (తూర్పుగోదావరి), పి.సాగర్ (అనకాపల్లి), కె.చంద్రమౌళి (విజయనగరం), బి.ఉదయ్‌కుమార్ (శ్రీకాకుళం)... బాలికల జట్టుకు సంబంధించి పి.మౌనిక (విజయనగరం), జి.హేమమాధురి (తూర్పుగోదావరి), పి.రేణుక (విజయనగరం), జి.సుప్రియ (అనంతపురం), కె.నారాయణమ్మ(విశాఖ), కె.ఇందు (విజయనగరం), కె.అనిత(కాకినాడ) ఎంపికయ్యారు. జాతీయస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో విజేతలై వారిని 2027లో అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తారని రమేష్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణానికి చెందిన వేగుళ్ల చైతన్య బాబు, కాకినాడకు చెందిన రెడ్‌క్రాస్ ఛైర్మన్ వైడీ రామారావు, ముత్యాల బాలమురళీకృష్ణ బహుమతులు అందజేశారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు గెడా శ్రీనివాస్, మండపేట జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎమ్ ముంగర వెంకట్రాజు, పి.తవిటయ్య, కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో కానరాని మార్పులు

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



ప్రసంగిస్తున్న ఉమామహేశ్వరరావు

సామర్లకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల జీవితాల్లో మార్పులు కానరావట్లేదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కాకినాడ జిల్లా సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో సామర్లకోట, అమలాపురం ఏపీబీసీఎల్ హమాలీ వర్కర్ల యూనియన్ 5వ మహాసభను ఘనంగా నిర్వహించారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 6.5 లక్షల మంది ప్రభుత్వ, ప్రైవేటు గోదాముల్లో కార్మికులుగా పనిచేస్తున్నారని వారికి శ్రమకు తగిన రీతిలో వేతనాలు అందట్లేదన్నారు. తొలుత సీఐటీయూ పతాకాన్ని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. రాష్ట్రంలోని 17 ఏపీబీసీఎల్ డిపోల నుంచి 150 మంది హమాలీలు హాజరయ్యారు. సీఐటీయూ నాయకులు దువ్వా శేషబాబ్జీ, ఎం.మదన్‌మోహన్, రాష్ట్ర కార్యదర్శి విప్పర్తి కొండలరావు, రామారావు, వి.అప్పలరాజు, సోమేష్, ఎం.రామారావు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్ నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ బెవరేజస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గ ఎన్నికలను ఆదివారం సామర్లకోటలో నిర్వహించారు. అధ్యక్షుడిగా విప్పర్తి కొండలరావు, కార్యదర్శిగా ఎం.మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా బత్తుల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఎన్వీ సుబ్బారెడ్డి, ఎన్.ప్రసాదరావు, రామారావు, మూర్తి, రాముడు, మల్లికార్జున్, సాంబయ్య, కార్యదర్శులుగా కొండలరావు, తిరుషేక్, శ్రీనివాసు, సూర్యచంద్ర, మణిప్రసాద్, పవన్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా అప్పలరాజు, ఆర్.సుబ్బారాయుడు, చిన్న, ప్రశాంత్, మోహన్‌రాము ఎన్నికయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బలరామపురం విద్యార్థి



బంగారు పతకాలతో శ్రీనివాస్

రౌతులపూడి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో,షార్ట్‌పుట్ పోటీలకు కాకినాడ జిల్లా రౌతులపూడి హైస్కూల్లో పదో తరగతి చదువుతున్న బలరామపురం గ్రామానికి చెందిన పైల శ్రీనివాస్ ఎంపికయ్యాడు. ఆదివారం కాకినాడ ఏపీ ఎస్పీలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఈనెల 25,26న ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎమ్ కోళ్ల రాంబాబు తెలిపారు.

16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఎటపాక, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం రాత్రి అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోని శిథిలమైన ఓ ఇంట్లో స్వాధీనం చేసుకున్నారు. పురుషోత్తపట్నం సమీపంలోని సెయింట్‌ఆన్స్ పాఠశాల సమీపంలో శిథిలమైన ఇంట్లో పీడీఎస్ బియ్యం నిల్వలు ఉంచినట్టు తహశీల్దార్‌కు సమాచారం అందింది. దీంతో తహశీల్దార్ కారం సుబ్బారావు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఆ ఇంట్లో బస్తాల్లో నిల్వలు చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 16 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసి పురుషోత్తపట్నంలోని రేషన్ దుకాణానికి తరలించారు.

పోగొట్టుకున్న రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాల అప్పగింత



రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అప్పగిస్తున్న అన్నవరం ఎస్ఐ

అన్నవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ అప్రమత్తతతో ఆదివారం రాత్రి ఒక వ్యక్తి పోగొట్టుకున్న సుమారు రూ.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తనచెంతకు చేరాయి. వివరాల్లోకి వెళితే కాకినాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న కాజా మొయినుద్దీన్ అన్నవరం దేవస్థానం టోల్‌గేట్ సమీపంలో తన బంగారు ఆభరణాలు కలిగిన బ్యాగ్‌ను వేరే వ్యక్తుల బ్యాగ్‌లో కలసిపోవడంతో దీనిని గమనించిన దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది వాటిని తీసుకుని అన్నవరం ఎస్ఐ హరిబాబు సమక్షంలో మొయినుద్దీన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా అతడు అన్నవరం దేవస్థానం సెక్యూరిటీ వ్యవస్థను అభినందించారు.

పిచ్చికుక్క దాడి

ఎనిమిది మందికి గాయాలు

గండేపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామం పాతూరులో శనివారం రాత్రి పిచ్చికుక్క గ్రామస్తులపై దాడి చేసి 8 మందిని గాయపరిచింది. పిచ్చికుక్క దాడితో గ్రామస్తులు భయంతో పరుగులు తీశారని స్థానికులు తెలిపారు. గాయపడిన 8 మంది జెడ్.రాగంపేట ప్రభుత్వాసుపత్రిలో చేరారు. గాయపడ్డవారిలో పవన్, చంద్రం, అంకం శ్రీను, రావుల నారాయణరావు, రవిపాటి అబ్బు, చింతపలి శ్రీను, బోను శ్రీను, వినోద్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో

తూర్పుగోదావరి జిల్లాకు ప్రథమం



పోటీల్లో ప్రథమస్థానం సాధించి కప్ అందుకుంటున్న తూర్పుగోదావరి జిల్లా బాలురు

బిక్కవోలు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా బాలురు ప్రథమ స్థానం, బాలికలు తృతీయ స్థానం సాధించారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం రామాపురంలో ఈనెల 12 నుంచి జరిగిన పదో అండర్-19 రాష్ట్ర స్థాయి బాల,బాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో బాలుర నుంచి తూర్పుగోదావరి జిల్లా జట్టు చిత్తూరు జిల్లాపై విజయం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ఈ టీమ్‌లో బిక్కవోలుకు చెందిన వినయ్, మణికంఠరెడ్డి, కైలాష్, హేమంత్ ఆడారు. కెప్టెన్‌గా వ్యవహరించిన వినయ్ అనంతపురం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ నుంచి టీమ్ సభ్యులతో పాటు కప్ అందుకున్నారు. అలాగే జిల్లా బాలికలు శ్రీకాకుళం జట్టుపై తలపడి విజయం సాధించి మూడో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఈ టీమ్‌లో బిక్కవోలుకు చెందిన చాందినిప్రియ, అలేఖ్య, శిరీష, భార్గవి పాల్గొన్నారని జిల్లా బాల్‌బాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పన స్వామి, ముప్పన వీర్రాజు, సభ్యులు సీతాపతిరావు తెలిపారు. బాలుర టీమ్ కోచ్‌గా పీఈటీ మోహనరావు, బాలికలకు సునీత కోచ్‌లుగా వ్యవహరించారు.

ఖతర్ నుంచి సురక్షితంగా స్వగ్రామానికి..

కోనసీమ మహిళ రాక



కనకమహాలక్ష్మి

అమలాపురం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఖతర్ దేశంలో తీవ్ర అనారోగ్యం, యజమాని పని ఒత్తిడి కారణంగా ఇబ్బందులు పడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రు మొక్కలతిప్ప జైభీమ్ నగర్‌కు చెందిన గోడి కనకమహాలక్ష్మిని కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్(కేసీఎం) సహకారంతో సురక్షితంగా స్వగ్రామానికి తీసుకొచ్చినట్టుడీఆర్వో కె.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మి వాట్సాప్, వీడియో సందేశాల ద్వారా తన యజమానులు, ఏజెంట్ పెడుతున్న చిత్రహింసలపై చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ స్పందించారు. ఆమెను స్వదేశానికి తీసుకురావడానికి కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి, డీఆర్వో కె.మాధవిని ఆదేశించారు. దీనిపై స్పందించిన ఆమె విదేశీ రాయబార కార్యాలయంతో సంప్రదింపులు జరిపి అక్కడి ఏజెంట్ల సహకారంతో కనకమహాలక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి రప్పించినట్టు కేసీఎం సెంటర్ సమన్వయ అధికారి గోళ్ల రమేష్ తెలిపారు. ఖతర్‌లో అధిక పని ఒత్తిడి, యజమానుల వేధింపులు, సరైన ఆహారం లేకపోవడం వల్ల తీవ్ర అనారోగ్యం పాలై తాను చివరికి ఆత్మహత్యకు కూడా పాల్పడేందుకు సిద్ధమైన సమయంలో సాయం చేసినందుకు కోనసీమ కలెక్టర్, కేసీఎం బృందానికి కనకమహాలక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

నేటి నుంచి యూటీఎఫ్ రణభేరి యాత్ర

దివాన్‌చెరువు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి యాత్ర సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్ దయానిధి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 15న సోమవారం ఈ రణభేరి యాత్ర తునిలో బయలుదేరి ఆరోజు కాకినాడ జిల్లాలో పర్యటిస్తుందన్నారు. 16న అల్లూరి సీతారామరాజు జిల్లాలో యాత్ర సాగుతుందని, 17న తూర్పుగోదావరి జిల్లాలోని గోకవరం నుంచి ప్రారంభమై కోరుకొండ, రాజానగరం, రాజమహేంద్రవరం, రాజమహేంద్రవరం రూరల్, కడియం మీదుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేటకు చేరుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులకు బోధనేతర విధుల నుంచి విముక్తి కల్పించాలని, పాఠశాలలో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు కల్పించాలని, 12వ పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించి ఐఆర్ వెంటనే ప్రకటించాలని, డీఏలు విడుదలచేసి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

రాజానగరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): పాల ప్యాకెట్ కోసం నడిచి వెళ్తున్న వ్యక్తిని మోటార్‌సైకిల్ ఢీకొనడంతో మృతిచెందాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోలమూరు గ్రామ సెంటర్‌లో జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మోర్త సూరిబాబు(40) ఆదివారం ఉదయం పాల ప్యాకెట్ కోసం షాపునకు నడుచుకుంటూ వెళ్తుండగా వేగంగా వస్తున్న మోటార్‌సైకిల్ బలంగా ఢీకొంది. సూరిబాబు తలకు బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు రాజానగరం ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని...

రాజనగరం మండలం నరేంద్రపురం చెలగంపాడు కాలనీకి చెందిన దాకారపు సీతారామయ్య(56) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. ఈనెల 10న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పాలచర్లలోని తాడేలమ్మ ఆలయం సమీపంలో గోదావరి టౌన్‌షిప్ లేఅవుట్‌లో వేప చెట్టుకు పంచెతో ఉరేసుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు మణికంఠ ఫిర్యాదుతో ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేశారు.

గడ్డిమందు తాగి పండ్ల వ్యాపారి ఆత్మహత్య

సామర్లకోట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట స్టేషన్ సెంటర్ వద్ద పండ్ల వ్యాపారం చేసుకునే తలారి గోవిందు (పులిరాజు 45) దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ రెండు రోజుల క్రితం జీవితంపై విరక్తి చెంది గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న పులిరాజును చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించి వైద్యం అందించగా చికత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందినట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సామర్లకోట పోలీసులు తెలిపారు.



గోకవరం-రాజమహేంద్రవరం ప్రధాన రహదారిపై పార్కింగ్ చేసిన లారీలు

ప్రమాద ఘంటికలు

గోకవరంలో ప్రధాన రహదారిపైనే భారీ వాహనాల పార్కింగ్

- గోకవరం- రాజమహేంద్రవరం రోడ్డుపై పలు పరిశ్రమల వాహనాలు
- నిబంధనలకు విరుద్ధంగా నిలుపుదల
- ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- అనేక ప్రమాదాలు.. పలువురి మృత్యువాత

గోకవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు చెప్పిరావు. మనం ఎంత జాగ్రత్తగా వెళ్లినా ఎదుట మనిషి కూడా అంతే జాగ్రత్తగా రాకపోతే ప్రమాదం బారిన పడాల్సిందే. ఇటీవల రోడ్డుపై పార్కింగ్ చేసిన వాహనాలను ఢీకొని ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా ప్రధాన రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను పార్కింగ్ చేసి ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ విషయాలన్నీ సంబంధిత అధికారులకు తెలిసినా వారు ఎందుకనో పట్టించుకోరు. గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి, బావాజీపేట, వీరలింకపల్లి గ్రామాల సమీపంలో హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, హెచ్‌పీ గ్యాస్, ఇథనాల్ సంస్థలు ఉన్నాయి. వాటి నుంచి ఆయిల్, గ్యాస్‌ను బయట ప్రాంతాలకు తరలించేందుకు వందలాది భారీ వాహనాలు(ట్యాంకర్లు, ఇతర వాహనాలు) నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. అసలే ఇరుకుగా ఉండే ఈ (గోకవరం- రాజమహేంద్రవరం) ప్రధాన రహదారిపై ఇతర వాహనాల రాకపోకల కంటే ఈ సంస్థలకు చెందిన వాహనాలే వందల సంఖ్యలో ప్రయాణం చేస్తుంటాయి. ఆయా కంపెనీల నిర్వహణ సమయంలో లోపలికి లోడింగ్‌కు వెళ్లేటపుడు, లోడింగ్ పూర్తయ్యాక భారీ వాహనాలను ప్రధాన రహదారిపై పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇతర వాహనదారులు ఆయా ప్రాంతాల్లో ప్రయాణించేందుకు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను పార్కింగ్ చేయడం, ఎటువంటి సిగ్నల్స్ ఇవ్వకుండా ట్యాంకర్లను కంపెనీల నుంచి ఒకేసారి రహదారిపైకి పంపిస్తుండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకోస్తోందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గతంలో హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీల వద్ద ట్యాంకర్ల డ్రైవర్ల అజాగ్రత్త వల్ల పలువురు మృత్యువాత పడిన సంఘటనలున్నాయి. పది రోజుల క్రితం ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొని గుమ్మళ్లదొడ్డికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయా కంపెనీల వద్ద పార్కింగ్ చేసుకునేందుకు పార్కింగ్ ప్రదేశాలు ఉన్నా ఆ విషయాన్ని విస్మరించి ప్రధాన రహదారిపైనే వాహనాలను ఉంచడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. గతంలో రోడ్లపై ట్యాంకర్లను పార్కింగ్ చేయకుండా ఉండేందుకు స్థానిక పోలీసులు కానిస్టేబుళ్లను నియమించేవారు.రానురాను సిబ్బంది కొరత పేరుతో కాపలాను ఉపసంహరించారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, హెచ్‌పీ గ్యాస్, ఇథనాల్ కంపెనీల వద్ద ప్రధాన రహదారిపై వాహనాలను పార్కింగ్ చేయకుండా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఎస్పీ బాలుకు భారతరత్న ఇవ్వాలి

మంత్రి కందుల దుర్గేష్



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ధవళేశ్వరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యంకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న ప్రకటించాలని మంత్రి కందుల దుర్గేష్ కోరారు. స్థానిక నీటి పారుదల శాఖ కార్యాలయాల వద్ద గల పార్కులో ఇటీవల ఆవిష్కరించిన ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలుగు పాటకు ప్రపంచ ఖ్యాతిని తీసుకొచ్చిన గొప్ప నాయకుడు ఎస్పీబీ అని కొనియాడారు. గాయకుడిగా, నటుడిగా, సంగీత దర్శకుడిగా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, నిర్మాతగా పలు రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహనీయులని అన్నారు. అంతకుముందుకు దుర్గేష్‌కు రాకా సాంస్కృతిక సంస్థ, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు స్వాగతం పలికి, శాలువా, మెమోంటోతో సత్కరించారు.కార్యక్రమంలో రాకా రమణ, యర్రమోతు ధర్మరాజు, జీఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ గాలి సుబ్బరాజు, ఎం. ఏడుకొండలు, బొబ్బిలి శ్రీనివాసరావు, పీఎస్ శేషుకుమార్, అప్పన నాగ భూషణం, తిరుమల కృష్ణమోహన్, యడ్ల మహేష్, బీరా జయప్రకాష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యూటీఎఫ్ రణభేరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక ధోరణులు, బోధనేతర పనులకు నిరసనగా రాష్ట్రంలో ఈనెల 15 నుంచి యూటీఎఫ్ తలపెట్టిన రణభేరి కార్యక్రమంలో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎల్ఐసీ ఎంప్లాయీస్ రూమ్‌లో యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయకర్, షరీఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలతో రోజురోజుకూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోందన్నారు. కొత్త పీఆర్సీ వేయలేదని, ఏళ్ల తరబడి ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలు పేరుకుపోతున్నాయన్నారు. రాష్ట్రంలో ఈ నెల 15 నుంచి 19 వరకూ ఐదు బృందాలు జాతాలుగా రాష్ట్రమంతా పర్యటించి రణభేరి కార్యక్రమం చేపడతాయని చెప్పారు. జిల్లాలో 17న గోకవరంలో మొదలై సాయంత్రానికి డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట చేరుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.విజయగౌరీ, కోశాధికారి ఈవీవీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడారు. కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వేమగిరిలో భారీ అన్నసమారాధన



రాజహేంద్రవరంలో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే వాసు

కడియం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వేమగిరి దేవీజనార్దననగర్‌లో శ్రీలక్ష్మీ విఘ్నేశ్వర సరస్వతీ దేవీ స్వామి ఆలయం వద్ద గణపతి నవరాత్రుల సందర్భంగా భారీ అన్నసమారాధన జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయం వద్ద జరిగిన అన్నదానంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామ మార్కెట్ సెంటర్‌లో వినాయక చవితి నాడు ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం భారీ అన్నదానంతో ముగిసాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్నం వీరభద్రారెడ్డి తెలిపారు. కమిటీ సభ్యులు ద్వారంపూడి వెంకటరెడ్డి, కర్రి రామారెడ్డి, మల్లిడి బాబ్జి పాల్గొన్నారు.


రాజహేంద్రవరం కల్చరల్: రాజహేంద్రవరం నాలుగో వార్డులో నిర్వహించిన అన్నసమారాధనలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు.

ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలవాలి

టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి

అనపర్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని కులాలకు సంఘాలున్నాయని, వీటన్నిటికీ ఆదర్శంగా రెడ్డి సంక్షేమ సంఘం నిలవాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు.బిక్కవోలు మండలం కొమరిపాలెం గ్రామంలో నూతనంగా ఏర్పడిన రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి త్రినాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సభను మనోజ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలతో ప్రారంభించారు.అధ్యక్షుడిగా ద్వారంపూడి వెంకటరెడ్డి, గౌరవాధ్యక్షుడిగా కొవ్వూరి సత్యనారాయణరెడ్డి సహా కార్యవర్గం ప్రమాణం చేసింది. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, కొవ్వూరి పాపారెడ్డి,డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి, డాక్టర్ కృష్ణారెడ్డి, రాజబాబు, కర్రి ముకుందరెడ్డి, పడాల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా అన్నపూర్ణ



రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాస్తవిక కళా ప్రక్రియగా జనంలో నిలిచి, దేదీప్యమానంగా వెలుగొందిన నాటక రంగం, మళ్లీ వికాస పథంలో పయనిస్తేనే ప్రజా వికాసం సాధ్యమవుతుందని ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా రామచంద్రపురానికి చెందిన పెంకే అన్నపూర్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక వెంకటేశ్వర నగర్ శెట్టిబలిజ కార్యాలయంలో అన్నపూర్ణకు ఏర్పాటు చేసిన అభినందన సభలో సత్తిబాబు మాట్లాడుతూ అన్నపూర్ణ రాష్ట్ర నాటక రంగ అభివృద్ధిలో భాగస్వామి కావాలన్నారు. తన నియామకం పట్ల అన్నపూర్ణ..సత్తిబాబుతోపాటు మంత్రులు నారా లోకేశ్, వాసంశెట్టి సుభాష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పెంకే సాంబశివరావు, పెంకే శివతేజ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లో ఓంగ్సీగోల్ఫ్ వ్యూ భవనంలో జరిగిన ఓనం పండుగలో ఓ సాంస్కృతిక కార్యక్రమం

నేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గోరంట్ల



ఎమ్మెల్యే గోరంట్లకు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మికులు

కడియం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గతంలో తాను చేనేత కార్మికుల సమస్యలపై మాట్లాడానని, ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి హామీ ఇచ్చారు. ఆదివారం ఎమ్మెల్యే గోరంట్లను మండలంలోని వీరవరం, మురమండ, పొట్టిలంక నేత సంఘాల ప్రతినిధులతో పాటు, ఉమ్మడి జిల్లాలో వివిధ మండలాల పరిధిలో ఉన్న హసన్‌బాద, ఆదివారపుపేట, అంగర, వల్లూరు, నేలటూరు, శీల, మురారి గ్రామాలకు చెందిన చేనేత సొసైటీల ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత భరోసా కింద ఏడాదికి రూ.25 వేలు ఇవ్వాలని, ఉచిత విద్యుత్ ప్రకటించిన నాటి నుంచి చేనేత కార్మికులకు 200 యూనిట్లు అమలు చేయాలని, కొత్త పెన్షన్లు వచ్చేలా చూడాలని, గుర్తింపుకార్డులు ఇవ్వాలని, సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించాలని కోరారు. కార్యక్రమంలో కర్రా వీరభద్రరావు, దొంతంశెట్టి శ్రీను, గోరు నాగేశ్వరరావు, యర్రా వీరభద్రుడు, గుత్తి నందీశ్వరరావు, తుమ్మా నాగేంద్ర, వాసా శ్రీను, గోరు శ్రీను, జట్ల సత్యనారాయణ, గుత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఏఎంసీ డైరెక్టర్‌గా అర్చన



అర్చనను సత్కరిస్తున్న నాయకులు

సీతానగరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) డైరెక్టర్‌గా సీతానగరానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు మద్దాల కొండలరావు భార్య మద్దాల అచ్చియ్యమ్మ (అర్చన) నియమితులయ్యారు. ఆదివారం ఆమెను బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు. తన నియామకం పట్ల అర్చన బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్నచౌదరి, వెంకటలక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పలివెల వీరబాబు, దాసరి సుబ్బారావు, బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం 37వ డివిజన్ 2వ వీధిలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో నగరంలో ఎక్కడా సరైన విధానంలో అభివృద్ధి పనులు జరుగలేదన్నారు. చేసిన పనులు కూడా ఏదో మొక్కుబడిగా ప్రధాన రహదారుల్లో మాత్రమే డివైడర్లు ఏర్పాటు చేసి రోడ్డులను ఇరుకుమయం చేశారని విమర్శించారు. నగరంలోని రహదారులలో ఉన్న గుంతలను గుర్తించి వాటిని పూడ్చిగుంతలు లేని నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉమారామలింగేశ్వరస్వామి

దేవస్థానం కమిటీ ప్రమాణ స్వీకారం

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జాంపేట ఉమారామలింగేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం ఆదివారం సాయంత్రం జరిగింది. దీనికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి కమిటీ చైర్మన్‌గా దాసరి గురునాథరావు, డైరెక్టర్లుగా వెల్లంకి జయరామ్, కొండపల్లి శ్రీదేవి, బొమ్మన గౌరి, పులగం సూర్యభాస్కరం, వారణాసి సుశీల, ర్యాలీ వెంకటరమణ, మట్టాడి సాయిమురళీ, కొడమంచలి కామేశ్వరరావులతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం నూతన కమిటీని ఎమ్మెల్యేతోపాటు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను అభినందించారు. కూటమి అధికారంలోకి రావడానికి కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం



అనపర్తి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించిన వికసిత్ భారత్ లక్ష్యానికి సారధులుగా బీజేపీ కార్యకర్తలను సన్నద్ధం చేయడానికి విశాఖపట్నం వచ్చిన పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డాకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు బిక్కవోలు శ్రీలక్ష్మీ గణపతి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్రాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు.

న్యాయం కోసం మహిళ పోరాటం

- ఇటీవల భర్త మృతి
- దశదిన కర్మ కాగానే ఇంటి నుంచి గెంటేసిన అత్తింటి వారు
- పోలీసులకు ఫిర్యాదు

సీతానగరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం మహిళ పోరాటం చేస్తోంది. మండలంలోని రఘుదేవపురం గ్రామానికి సుంకర జ్యోతికి కూనవరం గ్రామానికి చెందిన సుంకర వీరబాబుతో సుమారు 11 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పదేళ్ల కుమారుడు చైతన్య ఉన్నాడు. వీరబాబు ఐదేళ్ల క్రితం కనిపించకుండాపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అలాగే తనకు, తన కుమారుడికి పోషణ ఇవ్వాలని కోరుతూ కోర్టును ఆశ్రయించింది. కాగా ఈ ఏడాది ఆగస్టు 26న అనకాపల్లి జిల్లా పరవాడ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమదంలో వీరబాబు మృతిచెందాడు. ఈ విషయం కోడలికి చెప్పకుండా తదుపరి కార్యక్రమాల నిమిత్తం మృతదేహాన్ని రాజమహేంద్రవరంలోని కైలాసగిరికి తీసుకొచ్చారు. అయితే స్థానికుల సమాచారంతో జ్యోతి అక్కడకు వెళ్లి తన కొడుకుతో అంత్యక్రియలు జరిపించి అక్కడ నుంచి అత్తింటికి చేరుకుంది. అయితే శనివారం కొడుకుతో దశదిన కర్మ పూర్తిచేయించిన వెంటనే అత్త, ఆడపడుచు, ఆడపడుచు భర్త కలిసి జ్యోతిని, ఆమె తల్లిదండ్రులను బలవంతంగా బయటకు నెట్టేశారు. ఆమె జోరు వానలో దిక్కుతోచక తల్లిదండ్రుల సహాయంతో ఆదివారం సాయంత్రం వరకు అక్కడే వేచి ఉంది. అయినా అత్త మనసు కరగలేదు. దీంతో జ్యోతి పోలీసుస్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. తాను భర్త ఆచూకీ కోసం తపన పడుతుంటే.. వీరబాబు ఎక్కడ ఉన్నది.. ఏం పనిచేస్తున్నారో తెలిసి కూడా తనకు చెప్పకుండా దాచారని నాకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సుంకర జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు అందిందని, చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

ప్రాచీన ఆలయాలకు

పోటెత్తిన భక్తులు

బిక్కవోలు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆదివారం స్థానిక శ్రీలక్ష్మీగణపతి, గోలింగేశ్వర, కుమారసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి బారులు దీరి స్వామి వార్లను దర్శించుకున్నారు. అలాగే బలభద్రపురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, సాయిమందిరంలోని బాబాను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

వివాహిత అదృశ్యం

రంగంపేట, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఏఎస్ఐ వీవీవీ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. మండలంలోని పెద్దదొడ్డిగుంట గ్రామానికి చెందిన 26 ఏళ్ల కొండేపూడి దాదామనికి వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. ఆమె ఈ నెల 13న రాత్రి 8గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తల్లి వారా సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని, దాదామని ఆచూకీ తెలిసిన వారు రంగంపేట ఎస్ఐ 94409 04854, అనపర్తి సీఐ 94407 96538 నెంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయాలని ఏఎస్ఐ పేర్కొన్నారు.

కర్నూల్ వాసి అదృశ్యం

రాజానగరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి కూలి పనుల కోసం వచ్చిన వ్యక్తి అదృశ్యమైనట్టు రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కర్నూలు జిల్లా నందికొట్కూర్‌కు చెందిన షేక్ మంసూర్ భాషా(36), మరో ఎనిమిది మంది సభ్యులతో కలిసి రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో కొంత కాలంగా టైల్స్ పనులు చేసుకుంటూ సూర్యారావుపేటలో ఒక గదిలో అద్దెకు ఉంటున్నాడు.గత నెల 30న తన భార్యకు ఫోన్ చేసి ఇంటికి వచ్చేస్తున్నానని చెప్పాడు. ఇలా చెప్పిన మంసూర్ ఎన్ని రోజులైనా ఇంటికి చేరుకోకపోవడంతో బావమరిది సయ్యద్ అల్లా భకాష్ ఆదివారం రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ పీవీ నారాయణ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96585, 77806 881168 నెంబర్లను సంప్రదించాలన్నారు.

గవర సంఘ వార్షికోత్సవం

కోరుకొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగపట్నంలో శ్రీ గౌరీ గవర సంఘం వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా గవర సంఘ ఏఎంసీ చైర్‌పర్సన్ తనకాల వెంకటరమణమ్మ నాగేశ్వరరావు దంపతులను సత్కారించారు. అలాగే గ్రామంలో పదో తరగతిలో 80శాతం మార్కులు సాధించిన 26మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రుల తోపాటు కార్యక్రమానికి విచ్చేసిన పెద్దలను సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల పెద్దమ్మాజీ, బుద్ద శ్రీనివాస్, సూరిశెట్టి అప్పలస్వామి, ఆడారి నాగేశ్వరరావు, ఎల్లపు రాజు, అతికంశెట్టి కామరాజు, సూరిశెట్టి భాస్కర్, బుద్ద శివాజీ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి పరవళ్లు
సముద్రంలోకి 5,06,438 క్యూసెక్కులు


యూరియా కొరత లేదు
జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు


పేరు : ధవళేశ్వరం బ్యారేజీ
నిర్మాణం : 1978


పేరు : రోడ్ కం రైలు బ్రిడ్జి
ఆసియాలోనే రెండో బ్రిడ్జి


పేరు : ఆర్చి బ్రిడ్జి
వైర్లు ఆధారం..
జపాన్ టెక్నాలజీ


సర్ ఆర్థర్ కాటన్ టైమ్‌లో నిర్మించిన బ్యారేజీ


పేరు : హేవలాక్ బ్రిడ్జి
నిర్మాణం : 1900

ఆహా..అద్భుతః!

రాజమహేంద్రవరం గోదావరిపై వంతెనలు ఒక అద్భుతమే.. ఏ వంతెన లెక్క తీసినా తక్కువ కాదంటే 50 ఏళ్లు పైనే.. ఏ వంతెనకు ఆ వంతెన పోటీపడుతుంటాయి.. ఎన్నిసార్లు చూసినా తనివి తీరదు.. వీటిని ఎలా కట్టారు చెప్మా అని అనిపించకమానదు.. ఎందుకంటే ఏనాడో బ్రిటీష్ వారి కాలంలోనే గోదారి చూపారు.. ప్రస్తుతం ఉభయగోదావరి జిల్లాలు సస్యశ్యామలంగా ఉన్నాయంటే.. ఆ ఘనత అంతా ధవళేశ్వరం బ్యారేజీదే.. ఏళ్లు గడచిపోతున్నా నేటికీ చెక్కుచెదరలేదు.. గోదారి మార్చలేదు.. మరో వైపున రోడ్ కం రైలు బ్రిడ్జి గాలిలోనే అంతా ఉంటుంది.. ఆసియాలోనే రెండో రోడ్ కం రైలు బ్రిడ్జిగా పేరు.. ఇక మూడోది ఆర్చి బ్రిడ్జి.. ఈ వంతెన టెక్నాలజీ అంతా సెపరేటు.. ఆ వంతెనపై ఉన్న వైర్లు ఆధారం అంటే ఆహా అనిపించకమానదు మరి.. ఇక అతి పాతది..నాలుగోది హేవలాక్ బ్రిడ్జి..దీని వయసు 125 ఏళ్లు.. ఈ నాటికి చెక్కుచెదరలేదంతే.. నేడో రేపో పర్యాటకంగా అభివృద్ధికి అడుగుల పడనున్నాయి.. యంత్రాలు అందుబాటులో లేని రోజుల్లోనే ఈ అద్భుతాలు ఆవిష్కరింపజేశారు మన ఇంజనీర్లు.. నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు..
నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి.. ఇంజనీరింగ్ డేను పురస్కరించుకుని ఒక చిత్రమాలిక. -ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

ఎంచక్కా.. వ్యాపారం!





బెల్ట్ జోరు..ఆపేవారెవరు..

కొవ్వూరు మండలంలో 16 గ్రామాలు ఉండగా 7 మద్యం షాపులు మాత్రమే ఉన్నాయి.. అంటే 9 గ్రామాల్లో మద్యం షాపులే లేవు. తాళ్లపూడి మండలంలో 18 గ్రామాలు ఉండగా 5 మద్యం షాపులు ఉన్నాయి. అంటే 13 గ్రామాల్లో లేవు.. ఇక కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అయితే మండల కేంద్రాలకు గ్రామాలకు మధ్య దూరం చాలానే ఉంటుంది.. దీంతో మద్యం షాపులు లేని గ్రామాలను వ్యాపారులు పంచుకుని అనధికారికంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఎక్సయిజ్ అధికారులు అటు వైపు చూసే సాహసం చేయడంలేదు..ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ మద్యం వ్యాపారం మూడు సీసాలు.. ఆరు గ్లాసులుగా సాగుతూనే ఉంది..

అన్నవరంలో దేవస్థానం వద్ద బ్రాంది షాపు ఉండదు.. కానీ అక్కడ మద్యం యథేచ్ఛగా లభ్యమవుతోంది.. ఎలాగంటే బెల్ట్ మహత్యం.. దేవస్థానం దిగువున ఉన్న దుకాణాల్లో జోరుగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయి.. ఆ సెంటర్‌కు వెళ్లి ఎవరిని అడిగినా బెల్ట్ షాపు ఎక్కడనేది చూపిస్తారు. కానీ మన ఎక్సయిజ్ అధికారులకు కనిపించదు.. ఎందుకో..! తలుపులమ్మ లోవకు వెళ్లేందుకు జాతీయ రహదారి దిగి.. పక్కనే కిరాణా కొట్టులోకి వెళితే చాలు మద్యం లభ్యమవుతోంది.. నిత్యం అమ్మకాలు సాగుతూనే ఉంటాయి.. ఆ దుకాణం వాహన డ్రైవర్లు అందరికీ సుపరిచితమే..అయినా అధికారులకు పట్టదు. ఎందుకంటే పేరుకు అనధికారికమైనా.. ప్రైవేటు వ్యాపారుల కనుసన్నల్లోనే అధికారికంగా బెల్ట్ దుకాణాలు సాగుతున్నాయి.. - (రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎక్సయిజ్ అధికారులు బెల్ట్ తీయలేకపోతున్నారు..గత టీడీపీ ప్రభుత్వంలో బెల్ట్‌షాపులను పూర్తిగా నిర్మూలించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో మాత్రం బెల్ట్‌షాపులు ఇబ్బడి ముబ్బడిగా పెరిగి పోయాయి..ప్రతి పల్లెలోనూ షాపులు వెలిశాయంటే అతిశయోక్తి కాదేమో.. అయినా ఎక్సయిజ్ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.. ఎందుకంటే ప్రస్తుతం పట్టణాలు, మేజర్ పంచాయతీల్లో మాత్రమే మద్యం దుకాణాలు ఉన్నాయి. గ్రామాల్లో మద్యం దుకాణాలు దాదాపుగా కనుమరుగయ్యాయి. దీంతో పల్లెజనం బెల్టు షాపులపై ఆధారపడక తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం తెచ్చిన కొత్త మద్యం పాలసీ కారణంగా గ్రామాల్లో మద్యం షాపులు ఉండే అవకాశం లేదు. ఇదే అదనుగా ప్రైవేటు మద్యం వ్యాపారులు తలో కొన్ని గ్రామాలు పంచేసుకొని బెల్టు షాపులను నిర్వహిస్తున్నారు. అటు బెల్టుల నుంచి.. ఇటు ప్రైవేటు మద్యం షాపుల నుంచీ ఎంతో కొంత అందుతుండడంతో ఒక దెబ్బకు రెండు తాయిలాల మాదిరిగా ఎక్సైజ్ కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తోంది.

గ్రామాల్లో మందు కరువు

ప్రభుత్వ మద్యం పాలసీలో ప్రైవేటు మద్యం షాపులకు లైసెన్స్‌లు ఇచ్చే సమయంలో మండల కేంద్రాలను యూనిట్‌గా తీసుకున్నారు. అంటే మండలంలో ఎక్కడైనా మద్యం షాపు ఏర్పాటు చేసుకోవచ్చు. సాధారణంగా మండల కేంద్రంలో జన సమ్మర్ధం ఎక్కువ. దీంతో షాపులు దక్కించుకున్న వాళ్లంతా మండల కేంద్రాల్లో దుకాణాలు తెరిచారు. పెద్ద గ్రామాల్లోనూ మద్యం షాపులు లేకుండా పోయాయి. అక్కడక్కడా అరకొరగా మాత్రమే దుకాణాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 1030 గ్రామాలు ఉంటే 80 శాతం గ్రామాల్లో మద్యం షాపులే లేవు.దీంతో ప్రైవేటు వ్యాపారులు గ్రామాల్లో బెల్టు షాపులు తెరిచారు. పెట్టుబడి లేని వ్యాపారం కావడంతో పల్లెల్లో చిరువ్యాపారులు పోటీపడుతున్నారు.

455 దుకాణాలు.. 1030 గ్రామాలు

తూర్పు గోదావరిలో 138, కాకినాడ జిల్లాలో 171, కోనసీమ జిల్లాలో 146 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాలో 19 మండలాలు, నగరపాలక సంస్థ 1, నగర పాలక సంఘాలు 2, రెవెన్యూ గ్రామాలు 303 ఉండగా రూరల్ జనాభా 12లక్షలు, అర్బన్ జనాభా 8 లక్షలు ఉన్నారు. కాకినాడ జిల్లాలో 21 మండలాలు, కార్పొరేషన్ 1, నగర పంచాయతీలు 2, రూరల్, రెవెన్యూ గ్రామాలు 412 ఉండగా రూరల్‌లో 5 లక్షలు, అర్బన్‌లో 10లక్షల జనాభా.. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాలు,నగరపాలక సంఘం 1, రూరల్, రెవెన్యూ గ్రామాలు 316 ఉన్నాయి. రూరల్‌లో జనాభా 17 లక్షలు, అర్బన్ 3 లక్షలు ఉన్నారు. ఈ లెక్కన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 1030 కిపైగా రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మొత్తం 455 ప్రైవేటు మద్యం షాపుల్లో 400 వరకూ పట్టణాలు/నగరాల్లోనే ఉన్నాయి. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని 35 లక్షల వరకూ జనాభాలో 10 లక్షల మందికి మద్యం తాగే అలవాటున్నా వాళ్లు 50 షాపుల్లోనే సర్దుకోవాల్సి వస్తోంది.

- కలిసొచ్చిన మద్యం పాలసీ
- మండలం యూనిట్‌గా కేటాయింపు
- గ్రామాల్లో మద్యం షాపులు నిల్
- బెల్టు షాపులు తప్పని పరిస్థితి
- గ్రామాలు పంచుకొన్న వ్యాపారులు
- పట్టించుకోని ఎక్సయిజ్ అధికారులు

అడకత్తెరలో ఎక్సయిజ్ శాఖ..

బెల్టు షాపులు చట్టరీత్యా అంగీకారం కాదు. పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది కేసులు నమోదు చేయవచ్చు. కానీ కొన్ని పరిస్థితుల వల్ల వాళ్లేమీ చేయలేకపోతున్నారు. అరకొరగా కేసులు నమోదు చేస్తున్నారు. బెల్టు షాపుల నుంచి వారికి నెలవారీ మామూళ్లు వెళతాయనేది బహిరంగ రహస్యమే. మరో వైపు ఆయా బెల్టు షాపులు నడుపుతున్న లైసెన్స్‌డ్ ప్రైవేటు మద్యం దుకాణాల నుంచీ ఎంతో కొంత ముడుతోంది. పైగా బెల్టు షాపుల వల్ల అమ్మకాలు పెరుగుతాయి. దీంతో లక్ష్యాలనూ సులభంగా చేరుకోవచ్చు. ఖజానాకు ఆదాయం సమకూరుతోంది. ఈ నేపథ్యంలో చూసీ చూడనట్టు వదిలేస్తున్నారు.

రెడీఎస్సీ!

నేడే ఉపాధ్యాయ అభ్యర్థుల తుది జాబితా విడుదల

- మొత్తం 1074 పోస్టులు
- 18న ఏలూరుకు అభ్యర్థులు
- 19న నియామకపత్రాలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాలు సోమవారం విడుదల చేయడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. జాబితాలను ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మున్సిపల్, ట్రైబల్ వెల్ఫేర్, జువనైల్ వెల్ఫేర్ యాజమాన్యాల వారీగా, పోస్టుల వారీగా రూపొందించారు. వీటిపై డీఎస్సీ కమిటీ చైర్మన్ అయిన కలెక్టర్ ఆమోదం తీసుకున్నట్టు కన్వీనర్, ఉమ్మడి జిల్లా డీఈవో ఎం.వెంకట లక్ష్మమ్మ ఆదివారం వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1074 పోస్టులను భర్తీచేయనున్న విషయం విదితమే. అభ్యర్థుల తుది ఎంపికజాబితాలను ఏలూరులోని కలెక్టర్, డీఈవో కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు, అధికారిక వెబ్‌సైట్ apdsc.apcfss.inలో అందుబాటులో ఉంచుతారు. రెండుదఫాలుగా మెడికల్ బోర్డు నిర్వహించిన వైకల్య శాతం అసెస్‌మెంట్ టెస్టులో వ్యత్యాసాల కారణంగా మెరిట్‌లో తనకు అన్ని అర్హతలున్నప్పటికీ సెలక్షన్ జోన్ పరిశీలన నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ జిల్లాకు చెందిన దివ్యాంగుల (పీహెచ్) కోటా అభ్యర్థిని ఒకరు న్యాయ స్థానాన్ని ఆశ్రయించినట్టు తెలిసింది.దీంతో పాటు రాష్ట్ర స్థాయిలో రాయలసీమకు చెందిన కొందరు అభ్యర్థులు పోస్టుల (స్కూల్ అసిస్టెంట్/ఎస్జీటీ) కేటాయింపు విధానాన్ని వ్యతిరేకిస్తూ న్యాయస్థానం తలుపు తట్టినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఉద్యోగాలకు ఎంపికైన తుది



జాబితాలు సోమవారం విడుదల కానుండడం గమనార్హం.దీనిపై విద్యాశాఖ ఎలా స్పందించిందీ తెలియరాలేదు. మరోవైపు డీఎస్సీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుదిజాబితాలు సోమవారం విడుదల చేస్తుండడంతో, ఉమ్మడి జిల్లాలో మండలాల వారీగా ఉద్యోగాలు పొందిన వారిని గుర్తించి, వారిని 18న ఏలూరుకు తీసుకు రావడం, ఎంపికచేసిన పాఠశాలల్లో భోజన,వసతి ఏర్పాట్లు కల్పించడం,19న ఉదయం వెలగపూడిలో జరిగే నియామకపత్రాల అందజేత కార్యక్రమానికి తీసుకెళ్లే పనులను పర్యవేక్షించడానికి డీవైఈవోలు, ఎంఈవోలకు ఇన్‌చార్జి బాధ్యతలను డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదివారం అప్పగించారు. వీరందరితో సోమవారం సమావేశం ఏర్పాటు చేసి, పాఠశాలల వారీ బాధ్యతలు కేటాయిస్తారు.


నిడదవోలు మండలం కంసాలిపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఎర్రకాలువ

ఉప్పొంగిన ఎర్రకాలువ

- రోడ్లపైకి చేరిన నీరు
- గ్రామాలకు రాకపోకలు బంద్
- మంత్రి, కలెక్టర్ సమీక్ష
- కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- అప్రమత్తం కావాలని సూచన

నిడదవోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తుంది. నిడదవోలు మండలం కంసాలిపాలెం తాడేపల్లిగూడెం మండలం మాధవరం మధ్య ఆదివారం ఎర్రకాలువ ఉధృతంగా ఉంది. అలాగే శింగవరం, తాళ్ళపాలెం గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.కొవ్వూరు ఆర్డీవో రాణిసుస్మిత, తహశీల్దార్ నాగరాజు నాయక్, ఎంపీడీవో జగన్నాథరావు ఎర్రకాలువ పరీవాహక ప్రాంతాల్లో పర్యటించారు. కంసాలిపాలెం,శింగవరం, తాళ్ళపాలెం,శెట్టిపేట, తిమ్మరాజుపాలెం గ్రామాలకు ఎర్రకాలువ వరద ముప్పు పొంచి ఉందని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పునరావాస కేంద్రాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

అప్రమత్తంగా ఉండండి : దుర్గేష్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) : ఎర్రకాలువకు ఒక్కసారిగా 6, 500 క్యూసెక్కుల వరద రావడంతో ఉధృతంగా ఉందని మంత్రి దుర్గేష్ తెలిపారు. 8,500 క్యూసెక్కులు దాటే ప్రమాదం ఉందన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు.ఈ కాలువ ముంపు వల్ల గోపాలపురం,నిడదవోలు నియోజకవర్గాలు ప్రభావితమవుతాయన్నారు. ఎర్రకాలువకు ఉధృతంగా వరద నీరు చేరడంతో ప్రజలను అప్రమత్తం చేసినట్టు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిడదవోలు మండలం తాళ్లపాలెం, కంసాలిపాలెం గ్రామాల్లో రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండడంతో ట్రాఫిక్ మళ్లించామన్నారు.కలెక్టరేట్, కొవ్వూరు ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, 24 గంటలూ హెల్ప్ లైన్ నెంబర్లు అందుబాటులో ఉంచామన్నారు. మెడికల్ క్యాంపులు సిద్ధం చేసినట్టు చెప్పారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

కొవ్వూరు ఆర్డీవో ఆఫీస్	7995367797
నిడదవోలు	9676253740
గోపాలపురం	7013027755
నల్లజర్ల	9491041451
ఉండ్రాజవరం	9491041474
బొమ్మూరు కలెక్టరేట్	8977935611

అగ్రి,ఆక్వాకల్చర్ హబ్‌గా జిల్లా
మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం కేంద్రంగా ఉన్న కొత్త తూర్పుగోదావరి జిల్లాను అగ్రికల్చర్, ఆక్వాకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దనున్నామని, జిల్లా అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు.జనసేన కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు.శాస్కి స్కీమ్ ద్వారా అఖండ గోదావరి ప్రాజెక్టుకు కేంద్రం నుంచి మంజూరైన రూ.94.44 కోట్లలో ఇప్పటికే కొన్ని పనులు మొదలు పెట్టామన్నారు. రాజమహేంద్రవరం,కడియం, నిడదవోలు ప్రాంతాలన్నీ సరికొత్త పర్యాటక శోభ సంతరించుకుంటాయన్నారు. నిడదవోలు అభివృద్ధికి 15 నెలల్లో రూ.300 కోట్లు వెచ్చించినట్టు చెప్పారు. ఇప్పటి వరకూ ఇక్కడ కలెక్టర్‌గా పని చేసిన పి.ప్రశాంతి పనితీరు బేష్ అని అభినందించారు. కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కీర్తి చేకూరిని స్వాగతిస్తున్నామన్నారు.

సోము వర్సెస్ ఉండవల్లి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపరాష్ట్రపతి ఎన్నిక సందర్భంగా ఆర్ఎస్ఎస్ మీద మాజీ ఎంపీ ఉండవల్లి అరుణకుమార్ చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ సోము వీర్రాజు బహిరంగ చర్చకు సవాల్ విసిరిన సంగతి విదితమే.దీనిపై ఉండవల్లి స్పందించారు.ఎప్పుడు బహిరంగ చర్చ పెడతారో పెట్టండి..నేను సిద్ధం అని అరుణ్‌కుమార్ ప్రతి సవాల్ విసిరారు.ఈ సవాళ్లు ఆసక్తికరంగా మారాయి.వీరిద్దరు ఎప్పుడు బహిరంగ చర్చకు సిద్ధమవుతారోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఊరికే.. తిరిగేస్తున్నారు!



- మహిళలు ఫుల్ హ్యాపీ
- నెల రోజులు..రూ.14 కోట్లు
- గతంలో 71 శాతం ఆక్యుపెన్సీ
- 84 శాతానికి పెరిగిన వైనం
- రద్దీగా పలు రూట్లు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఊరికే వస్తుంటే ఊరుకుంటారా.. అందుకే మహిళలు ఊరూరా తిరిగేస్తున్నారు. ప్రస్తుతం ఏ బస్ చూసినా మహిళలతో కిటకిటలాడుతోంది. స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం వినియోగించుకోవడం ద్వారా జిల్లా మహిళలు ఒక్కనెలలోనే దాదాపు రూ.14 కోట్లకు పైగా ఆర్థిక లబ్ధి పొందారంటే ఏ స్థాయిలో ప్రయాణిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. గత నెల 15వ తేదీన ఈ పథకం అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకూ 32 లక్షల మందికి పైగా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు రాకపోకలు సాగించారు. జిల్లా ఆర్టీసీ మొత్తం 96 రూట్లలో బస్సులు తిప్పుతుంటే వీటిలో 72 రూట్లను ప్రత్యేకంగా స్త్రీ శక్తి పథకానికే కేటాయించారు. ఇది మొత్తం రూట్లలో 75 శాతం. గత నెల 14వ తేదీకి ముందు వరకూ ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 71 శాతంగా ఉండేది. ఇప్పుడది 84 శాతానికి పెరిగింది. వీరిలో ప్రత్యేకంగా ఆడవాళ్ల శాతం 68.72 శాతం ఉండడం గమనార్హం. ఇదిలా ఉంటే స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చిన తర్వాత కొన్ని రూట్లలో విపరీతమైన రద్దీ పెరిగింది. రాజమహేంద్రరం - తుని, రాజమహేంద్రవరం-కాకినాడ వయా రాజానగరం, వయా బిక్కవోలు, కొవ్వూరు - ఏలూరు, కొవ్వూరు - జంగారెడ్డిగూడెం రూట్లలో రష్ ఎక్కువగా ఉంది.బస్సులకు డిమాండ్ పెరిగినా కొత్త రూట్లు ఆపరేట్ చేసే పరిస్థితి లేదు. జిల్లావ్యాప్తంగా గతంలో కొన్ని రూట్లలో బస్సు సర్వీసులు క్యాన్సిల్ చేశారు. వీటిని పునరుద్ధరించాలని డిమాండ్ ప్రధానంగా వస్తున్నా కొత్త సర్వీసులు నడిపేందుకు ప్రస్తుతం అవకాశం లేదని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉన్న బస్సులతోటే నడపమనే ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా జిల్లా ఆర్టీసీ అధికారులు షెడ్యూళ్లు నిర్వహిస్తున్నారు.

ప్రయాణ ఖర్చు రూ.13.82 కోట్లు

ఉచిత బస్సు పథకం ప్రారంభమైన నెల రోజుల్లో ఆక్యుపెన్సీ రేషియో బాగా పెరిగింది. మహిళలు పెద్ద ఎత్తున బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు.ఈనెల 12వ తేదీ వరకూ లెక్కలు పరిశీలిస్తే 31.73 లక్షల మంది మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ట్రావెల్ చేశారు. రూ.13.82 కోట్లు లబ్ధిపొందారు.
- మూర్తి, జిల్లా ప్రజారవాణా అధికారి

ఆరోగ్యానికి..సైకిల్!

ఈ ఫొటోల్లో కనిపిస్తున్న వాళ్లు క్రీడాకారులు కాదండి. మన పోలీసులే. 'ఫిట్ ఇండియా' కార్యక్రమంలో భాగం గా ప్రతి ఆదివారం పోలీస్ శాఖ 'సండే ఆన్ సైకిల్ నిర్వహిస్తోంది. ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాలతో జిల్లా పోలీసులు ఈ ఆదివారం ఇలా సైక్లింగ్ చేశారు. అధికారులు, సిబ్బందిలో శారీరక దృఢత్వం, ఆరోగ్యకర మైన జీవనానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో మేలు చేస్తాయని అడిషనల్ ఎస్పీ మురళీకృష్ణ అన్నారు. - రాజమహేంద్రవరం



ఉమాచోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన


ఆలయంలో బిల్వార్చన నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతవూరులో వేంచేసియున్న ఉమాచోడేశ్వరస్వామికి ఆదివారం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు కౌత వరపు భాను, దేవరకొండ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో దొమ్మేరుకు చెందిన శివకోటి రవి ప్రసాద్, సాయిజ్యోతి పీఠాలపై కూర్చుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తులను విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో పున్నమ్మరాజు కార్తీక్‌శర్మ, ఏడిద సత్య నాగ శివతేజ, శివకోటి దీక్షితులు, పమ్మి రవిబాబు, దామరాజు సచ్చిదానంద, గరిమెళ్ల సత్యనారాయణ, కాసర కోదండరామ్ పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరి సమేత సుందరేశ్వరస్వామి వారికి లక్షపత్రి పూజ, అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మానేపల్లి శ్రీనివాస శాస్త్రి పర్యవేక్షణ, సుందర గణేష్ ఆధ్వర్యంలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

'కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది'


మల్లేశ్వరంలో బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న మంత్రి దుర్గేష్

పెరవలి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. మల్లేశ్వరంలో ఇటీవల మరణించిన పార్టీ కార్యకర్త గుత్తుల నాగార్జునకు రూ. ఐదు లక్షల ఇన్సూరెన్స్ మంజూరయ్యింది. ఈ చెక్కును ఆదివారం మంత్రి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో దేవికా రాణి, మేడిచర్ల భాస్కర కుమార్, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు


వికాస్ విద్యాసంస్థలో విద్యార్థికి మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కు అందిస్తున్న విద్యాసంస్థ అధినేతలు

నిడదవోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాలు సాధించి మెరిట్ స్కాలర్‌షిప్ రూ. లక్ష అందుకున్న విద్యార్థులను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని వికాస్ విద్యా సంస్థల డైరెక్టర్ ఆత్కూరి రామారావు అన్నారు. ఆదివారం సమిశ్రగూడెంలోని వికాస్ విద్యాసంస్థలలో ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు, విద్యాసంస్థల డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలు ఏర్పాటు : ఆర్డీవో

కొవ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్ర కాలువ వరద ప్రభావిత ప్రాంతాలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. ఆదివారం ఆమె పట్టణంలో మాట్లాడుతూ నిడదవోలు మండలం తాళ్లపాలెం, కంసాలిపాలెం ప్రాంతాల్లో ఎర్రకాలువ ఉధృతి కావడంతో రహదారులపై నీటి ప్రవాహం కొనసాగుతోందన్నారు. అందువల్ల వరద ప్రభావిత గ్రామాల్లో ప్రజల రక్షణ కోసం పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కాగా, ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అప్రమత్తంగా ఉండి అధికారుల సూచనలు పాటించాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలిరావాలన్నారు. అక్కడ తాగునీరు, ఆహారం, వైద్య సదుపాయాలు, ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పునరావాస కేంద్రాలు ఇవే :

- తాళ్లపాలెం జిల్లా పరిషత్ స్కూల్
- రావిమెట్ల మండల పరిషత్ ఉన్నత పాఠశాల
- సింగవరం, తిమ్మరాజుపాలెంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఉండ్రాజవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం బౌద్ధదమ్మపీఠంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు పీఠాధిపతి అనాలయో ఆదివారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. ఇందులో ఉచితంగా కంటిపరీక్షలు, అర్హులైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామన్నారు. స్థానికులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

ఆపదలో ఆదుకోవడమే 'కూటమి' లక్ష్యం

● ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు


బాధితురాలు నాగమణికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

చాగల్లు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని అన్నివిధాలా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. చాగల్లులో భారీ వర్షానికి ఇళ్లు కూలిపోయిన బాధితురాలు జీ. నాగమణిని ఆదివారం రూ. ఐదు వేల చెక్కును సహాయంగా అందజేశారు. నెలటూరుకు చెందిన ఎంపీటీసీ తాళ్లూరి రమ్య, దామోదరం దంపతులు ఈనగదును సమకూర్చారు. అలాగే ప్రభుత్వం అందజేసే 10 కేజీల బియ్యం, పంచదారతో పాటు కూటమి నాయకుల సహకారంతో మరో 25 కేజీల బియ్యాన్ని అందజేశారు. అలాగే తాగునీరు కుళాయి ఉచితంగా వేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటుందని ధైర్యం చెప్పారు. బోదకాలుతో బాధపడుతున్న గొల్ల నాగమణిని ఆయన పరామర్శించారు. బాధితురాలు మాట్లాడుతూ వైద్యం కోసం సహాయం అందించాలని, పెన్షన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన సహాయం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వరలక్ష్మిని ఆయన పరామర్శించారు. డయాలసిస్ ఆపరేషన్‌కు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందజేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నేతలు కరుటూరి సతీష్, తాళ్లూరి ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, జనసేన నాయకులు ఉప్పులూరి చిరంజీవి, మిరియాల సతీష్, బీజేపీ నేతలు తాళ్లూరి వరప్రసాద్, జొన్నకూటి సుబ్బారావు పాల్గొన్నారు.

నిర్మలగిరి మేరీమాత మందిరానికి రెండు ఏసీల బహూకరణ


ఏసీలను పుణ్యక్షేత్ర డైరెక్టర్‌కు అందజేస్తున్న దాత కళ్లే నాగేశ్వరరావు

దేవరపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిర్మలగిరి మేరీమాత మందిరానికి రూ.లక్ష విలువ చేసే రెండు ఏసీలను పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్‌కు నిర్మలగిరి నిత్యాన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు ఆదివారం అందజేశారు. జాన్‌పీటర్ మాట్లాడుతూ మేరీమాత మందిరాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించటంతో పాటు భక్తులు ప్రార్థించుకోనుటకు మందిరం చుట్టూ అద్దాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా దాతను జాన్‌పీటర్ అభినందించారు. కార్యక్రమంలో ఫాదర్ ప్రేమ్‌కుమార్, శ్యామ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రేపు సెపక్‌తక్రా పోటీలు

దేవరపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం బాలురు, బాలికల సీనియర్ సెపక్‌తక్రా పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పేరం రవీంద్రనాథ్, పీడీ సరస్వతి ఆదివారం తెలిపారు. ఈ పోటీలు ఆ రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు.

పూర్తిస్థాయిలో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు

● జిల్లా వ్యవసాయశాఖాధికారి మాధవరావు ● దొమ్మేరు సొసైటీ సందర్శన


దొమ్మేరు సొసైటీలో ఎరువులను పరిశీలిస్తున్న మాధవరావు, తదితర అధికారులు

కొవ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల వ్యవసాయ అవసరాలకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులను పూర్తిస్థాయిలో సప్లయి చేయడం జరుగుతుందని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు తెలిపారు. ఆదివారం దొమ్మేరు సొసైటీలో యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు వివిధ పంటల్లో వాడాల్సిన నత్రజని, అధిక మోతాదులో నత్రజని వాడకం వల్ల కలుగు నష్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం మాధవరావు మాట్లాడుతూ యూరియా బస్తాలలో రూపంలో వాడకం వల్ల మొక్కలకు 35 శాతం మాత్రమే అందుతుందని, మిగిలిన 65 శాతం వివిధ రూపాలలో ఆవిరి అవుతుందన్నారు. ప్రైపాటిగా నానో యూరియా స్ప్రేయింగ్ పద్ధతిలో వాడడం వల్ల 80 శాతం మొక్కలకు ఉపయోగపడుతందన్నారు. జిల్లాలో 23,500 మెట్రిక్‌టన్నుల యూరియా సరఫరా చేయడం జరిగింది. 3,500 మెట్రిక్ టన్నుల యూరియా ఈ సీజన్‌లో అధికంగా ఇచ్చామని, ఎక్కడా కొరత లేదన్నారు. దొమ్మేరు సొసైటీలో యూరియా నిల్వలు ఉన్నాయి. రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. రెండు, మూడు కోటా కింద నానో యూరియాను వాడుకోవచ్చునన్నారు. యూరియా అధికంగా వాడడం వల్ల నేల చౌడు బారిపోతుంది. నేలలో ఇంకిపోవడం, గాలిలో ఆవిరి అయ్యిపోవడం, యూరియా వేసేటప్పుడు అనర్థాలు ఎక్కువగా ఉంటాయి. నానో యూరియా పిచికారీ చేయడం వల్ల ఆకు ద్వారా తీసుకోవడంతో నేలకు ఎటువంటి ఇబ్బంది కలగదన్నారు. రెండు, మూడు కోటాలు యూరియా వేయని రైతులు నానో యూరియా వేసుకోవచ్చునన్నారు. అరలీటరు బాటిల్ సరిపోతుంది. 90 శాతం పంటకు ఉపయోగపడుతుంది. రైతులు అందరూ సాగులో నానో యూరియాను ప్రోత్సహించి వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గారపాటి రామకృష్ణ, సొసైటీ కార్యదర్శి కరిబండి ప్రసాద్, కలగర సుబ్బారావు, మేకల శ్రీను, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారులు సీహెచ్.శ్రీనివాసరావు, ఏ.గంగాధర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బోటును తక్షణం సీజ్ చేయాలి

కొవ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నదుల్లో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం ఇసుక తవ్వకాలు చేపట్టాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి శ్రీమన్నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొవ్వూరు పాత రైలు వంతెన సమీపంలోని కాటన్‌బొమ్మ వద్ద ఉన్న డ్రెడ్జింగ్ బోటును తక్షణం అధికారులు సీజ్ చేయాలన్నారు. గోదావరినదిలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాల ప్రకారం మనుషులతోనే ఇసుక తవ్వకాలు జరపాలన్నారు. భారీ యంత్రాలను ఉపయోగించరాదన్నారు. కార్మికుల జీవనోపాధిని దెబ్బతీసే భారీ డ్రెడ్జింగ్ పడవను అధికారులు స్వాధీనం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలన్నారు.

వెంకటకృష్ణప్రసాద్‌కు అవార్డు ప్రదానం


గుంటూరులో అవార్డుతో సత్కరిస్తున్న బ్రాహ్మణ సేవాసంఘం నాయకులు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మోర్త హైస్కూల్‌లో తెలుగుపండిట్‌గా పనిచేస్తున్న చెరుకూరి వెంకటకృష్ణప్రసాద్ గుంటూరులో ఆదివారం జరిగిన అఖిలాంధ్ర ఆపన్న దీవన బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2025 ప్రదానోత్సవంలో అవార్డును అందుకున్నారు. తెలుగుపండిట్‌గా ఉత్తమ సేవలు అందిస్తున్న వెంకటకృష్ణ ప్రసాద్‌ను మెమెంటోతో పాటు శాలువాకప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఉండ్రాజవరం బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఆకెళ్ల శ్రీనివాసరావు, దోనేపూడి సుధాకర్, సత్యకృష్ణతోపాటు మోర్త హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఫణికుమార్‌కు అభినందనలు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాలంగికి చెందిన గ్రామ జనసేన పార్టీ అధ్యక్షుడు, పాలంగి గ్రామ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ జాయింట్ సెక్రటరీగా పనిచేస్తున్న వసంతవాడ ఫణీంద్రకుమార్‌కు రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపిక కావడంపై గ్రామ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘ నేతలు ఆదివారం ఆయన్ని అభినందించారు. ఫణికుమార్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. తనకు ఈ డైరెక్టర్ పదవి రావడానికి కృషి చేసిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గోదావరి పరవళ్లు

ధవళేశ్వరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతూ సముద్రంలోకి ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ ధవళేశ్వరం, ర్యాలి ఆర్మ్‌లోని మొత్తం గేట్లను 1.5 మీటర్లు.. మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌లోని మొత్తం గేట్లను మీటరు మేర పైకి ఎత్తి 5,06,438 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10 అడుగులుగా నమోదైంది. ఎగువున భద్రాచలం వద్ద 36.10 అడుగుల వరకు పెరిగిన నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది.

విద్యుత్ మీటరును తొలగించారు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చెట్టుకు బిగించిన మీటరును తొలగిస్తున్న ఏఈఈ శ్రీనివాసరావు, సిబ్బంది

కొవ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పశివేదలలో రోడ్డు పక్కన గల ఓ చెట్టుకు ప్రమాదకరంగా బిగించిన విద్యుత్ మీటరును అధికారులు ఎట్టకేలకు తొలగించారు. చెట్టుకు విద్యుత్ మీటర్ అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన వార్తకు విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. కొవ్వూరు ఎలక్ట్రికల్ ఏఈఈ సీహెచ్ శ్రీనివాసరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నాలుగురోడ్ల కూడలిలో చెట్టుకు బిగించి ఉన్న విద్యుత్‌మీటర్‌ను తక్షణం తొలగించారు.

ఉచిత వైద్యశిబిరం


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

తాళ్లపూడి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోచవరంలో సొసైటీ అధ్యక్షుడు అనపర్తి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో జనరల్, ఆర్థో డాక్టర్ యలమర్తి గౌతమ్ రాయుడు, డాక్టర్ అరిగే బాలకృష్ణ పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు. 100 మందికి పైగా జనాలు హాజరై రక్తపరీక్షలు చేసుకున్నారు.

ఇద్దరు కోడి పందెం రాయుళ్ల అరెస్టు

కొవ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పీ. విశ్వం తెలిపారు. వాడపల్లి గోదావరి ఏటిగట్టు కింద కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం రావడంతో సీఐ తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. అలాగే వారి నుంచి ఒక కోడి పుంజు, రూ. 1000 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కమిషనర్ కార్యాలయ

ముట్టడిని విజయవంతం చేయాలి

కొవ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని సెప్టెంబరు 15న చేపట్టిన విజయవాడ లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమంలో అధికసంఖ్యలో కార్మికులు పాల్గొనాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు అన్నారు. ఆదివారం కొవ్వూరు భవన నిర్మాణ కార్మిక సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం మైగాపుల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దుకూరి దొరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన ఎన్నికల మామీలను అమలు చేయకుండా విస్మరిస్తోందన్నారు. జగన్ ప్రభుత్వం తీసుకువచ్చిన 1214 మెమోను రద్దుచేసి, నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ద్వారా పథకాలు అమలుచేయాలన్నారు. రాష్ట్రంలో 35 లక్షల మంది కార్మికులకు వారి నిధులు వారికి చట్టబద్ధంగా అందించడంలో కూటమి ప్రభుత్వం కావాలనే కాలయాపన చేస్తోందన్నారు. వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించి గడిచిన ఆరున్నర సంవత్సరాలుగా చనిపోయిన, దివ్యాంగులై ఆసుపత్రి పాలైన అందరికీ సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాణికిరెడ్డి హరిబాబు, రామకృష్ణ, జొన్నల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కోటసత్తెమ్మ ఆలయానికి భక్తుల తాకిడి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నిడదవోలు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసి ఉన్న కోటసత్తెమ్మ వారిని వివిధ జిల్లాల నుంచి భక్తులు ఆదివారం పెద్ద సంఖ్యలో వచ్చి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహానివేదన చేశారు. భక్తులు అమ్మవారిని ప్రత్యేక, ఉచిత దర్శనాలు చేసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక దర్శనం ద్వారా 33,640 రూపాయలు, అన్నదాన విరాళాల ద్వారా 4821 రూపాయలు, ప్రసాద విక్రయాల ద్వారా 34,375 రూపాయలు, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా 59,790 రూపాయలు... మొత్తం 1,31,626 రూపాయల ఆదాయం లభించినట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

పలు గ్రామాల్లో భారీ అన్నసమారాధనలు


ఉండ్రాజవరం: అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

ఉండ్రాజవరం, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంగి వరసిద్ధి వినాయక ఆలయం వద్ద ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. తణుకు, కే.సావరం, చివటం, ఉండ్రాజవరం గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి పాల్గొన్నారు. అలాగే తాడిపర్రులో సిద్ధి వినాయక ఆలయం వద్ద కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

చాగల్లు: మండల కేంద్రమైన చాగల్లులో ఆదివారం రెండుచోట్ల భారీ అన్నసమారాధనలు జరిగాయి. శ్రీగణపతి నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా తెలగ సంఘం వారి ఆధ్వర్యంలో వినాయకుడి ఆలయ ప్రాంగణంలో కార్యక్రమం జరిగింది. అలాగే సంపత వరసిద్ధి వినాయకుడి ఆలయ ప్రాంగణంలో చాగల్లు, నెలటూరు వర్తకసంఘం వారి ఆధ్వర్యంలోనూ నిర్వహించారు.గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆయా ఉత్సవ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. యువకులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని సేవలందించారు.

తాళ్లపూడి: తాళ్లపూడి సాయి స్ఫూర్తి హాస్పటల్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రుల సందర్భంగా ఆదివారం భారీ అన్న సమారాధనను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో హాస్పటల్ సీఈవో గూడా విజయరాజు పాల్గొని మాట్లాడుతూ ఈ సంవత్సరం హాస్ప టల్ వార్షికోత్సవం సందర్భంగా గణపతి నవరాత్రులు ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసంతర్పణ చేశామన్నారు. తాళ్లపూడి, ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారన్నారు. కార్యక్రమంలో హాస్పటల్ సిబ్బంది, గ్రామస్థులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


తాళ్లపూడిలో ..

రేపు దివ్యాంగ చిన్నారులకు ప్రత్యేక క్యాంపు

కొవ్వూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు నియోజకవర్గంలో 1 నుంచి 18 సంవత్సరాల దివ్యాంగ పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ క్యాంపును మంగళవారం నిర్వహిస్తున్నట్టు కొవ్వూరు ఎంఈవో-2 కిషోర్ తెలిపారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అలింకో సంస్థ ద్వారా అర్హులైన పిల్లలకు ఉపకరణాలు ఉచితంగా ఇవ్వడానికి పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో ఆరోజు ఉదయం తొమ్మిది గంటల నుంచి ఈ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని అన్నిప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు, ఇంటివద్దనే ఉంటున్న పిల్లల తల్లితండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, రోలెటర్లు, మూడు చక్రాల కుర్చీలు, సిపి ఛైర్లు, ఎంఆర్ కిట్లు, చంకకర్రలు, బ్రెయిలీ కిట్లు అందజేస్తారన్నారు. క్యాంపునకు వచ్చేవారు పిల్లల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, రెండు ఫొటోలు, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, ఫోన్ నంబరు, జనన ధ్రువీకరణ పత్రం, తీసుకురావాలన్నారు. పూర్తి వివరాలకు భవిత పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణ, 7013507245, నానాజీ 9985761617 నెంబర్లను సంప్రదించాలన్నారు.